# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక



**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 3 | సంచిక: 203 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శనివారం 8 నవంబర్ 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


## హైదరాబాద్‌ను డ్రగ్స్‌కు అడ్డాగా చేసిన కేటీఆర్

**హైదరాబాద్ అభివృద్ధికి ఆ ఇద్దరే అడ్డంకి**

**బ్యాడ్ బ్రదర్స్ ఇద్దరూ అభివృద్ధికి మోకాలడ్డు**

**ఉమ్మడి ఏపిలో కాంగ్రెస్ హయాంలోనే నగరాభివృద్ధి**

**నగరంలో 44 చెరువులను కబ్జా చేసిన బిఆర్ఎస్ నేతలు**

**మూసీ పునరుద్ధరణ, మెట్రో పొడిగింపులకు కిషన్ రెడ్డి అడ్డు**

**జూబ్లీహిల్స్‌లో బిజెపికి డిపాజిట్ కూడా రాదు**

**ఎన్నిక ఏదైనా తానే రంగంలో ఉన్నట్లుగా భావిస్తా**

**ఓట్లు వేసి గెలిపిస్తే నగరాభివృద్ధికి పెద్దపీట**

**మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి**



హైదరాబాద్,నవంబరు7(ప్రభాత ఉదయం): రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే హైదరాబాద్ ఎక్కువగా అభివృద్ధి చెందిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి ఏపిలో 2004-2014 మధ్య కాలంలోనే రాష్ట్రంలో అభివృద్ధి అన్నది కనిపించిందన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓఆర్ఆర్, శంషాబాద్ విమానాశ్రయం, మెట్రో రైలు.. ఇవన్నీ కాంగ్రెస్ ప్రభుత్వమే తీసుకువచ్చిందన్నారు. 2014 నుంచి కేంద్రంలోని భాజపా, రాష్ట్రంలోని భారత రాష్ట్ర సమితి.. రాష్ట్రానికి చేసింది శూన్యం. హైదరాబాద్‌లో ఎలాంటి అభివృద్ధి జరగలేదు. 2014లో రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. 2023లో కేసీఆర్ తెలంగాణను రూ.8లక్షల కోట్ల అప్పుల్లో పెట్టి మళ్లీ కాంగ్రెస్‌కు అప్పగించారు. హైదరాబాద్‌కు యూపీఏ ప్రభుత్వం ఇచ్చిన ఐటీఐఆర్‌ను రద్దు చేసింది ఎవరని అన్నారు. ఐటీఐఆర్ కూడా మంజూరు చేసి ఉంటే రాష్ట్రం మరింత అభివృద్ధి చెంది ఉండేదని అన్నారు. వరదలు వచ్చి హైదరాబాద్ మునిగిపోతే కేంద్రం చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కేంద్రం నుంచి వరద సాయంగా రూపాయి కూడా తేలేదని అన్నారు. హైదరాబాద్‌లో 44 చెరువులను భారత రాష్ట్ర సమితి నేతలు కబ్జా చేశారు. అంబర్‌పేటలో బతుకమ్మకుంటను ఆ పార్టీ అంబర్‌పేట ఇన్‌ఛార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి ఆక్రమించారు. చెరువుల్లోని కబ్జాలను తొలగించి పునరుద్ధరిస్తే.. దానిపై రాజకీయం చేస్తున్నారు. అహ్మదాబాద్‌లో సబర్మతి ప్రక్షాళన చేసుకున్నారు.. యూపీలో నది ప్రక్షాళన చేశారు. అహ్మదాబాద్‌లో కొత్త నగరం కట్టుకున్నారు.. తెలంగాణలో అడ్డుకుంటున్నారు. గతంలో

..మిగతా 2లో

## ప్రైవేట్ విద్యాసంస్థల తాట తీస్తా

**విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటారా**

**బంద్ పెట్టి బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తానంటే ఎలా**

**విద్యార్థుల అకడమిక్ ఇయర్ లాస్‌కు ఎవరు బాధ్యులు**

**ఫీజులు ఇష్టానుసారం పెంచి రియంబర్స్‌మెంట్‌పై ఒత్తిడి**

**రాజకీయ పార్టీల ఉచ్చులో పడి బెదిరిస్తే ఊరుకునేది లేదు**

**ప్రైవేట్ విద్యాసంస్థల తీరుపై సిఎం రేవంత్ ఘాటు హెచ్చరికలు**



హైదరాబాద్,నవంబరు7(ప్రభాత ఉదయం): ప్రైవేటు విద్యాసంస్థల నిర్వాహకులు తమాషా చేస్తే తాటతీస్తానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటే ఊరుకునేది లేదని వార్నింగ్ ఇచ్చారు. విద్య అనేది సేవ.. వ్యాపారం కాదని స్పష్టం చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థలు సేవ చేయడం లేదు.. వ్యాపారం చేస్తున్నాయని సీరియస్ అయ్యారు. శుక్రవారం గాంధీభవన్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థులకు నష్టం కలిగిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఫీజు రీయంబర్స్ మెంట్‌పై ప్రైవేటు విద్యాసంస్థలు బ్లాక్‌మెయిల్ చేస్తున్నాయని ధ్వజమెత్తారు. కాలేజీలను బంద్ చేయించిన వారితో చర్చలు ఎలా ఉంటాయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఫీజురీయంబర్స్‌మెంట్‌పై ప్రైవేటు విద్యాసంస్థలు ఇటీవల బంద్‌కు పిలుపునిచ్చాయి. ప్రభుత్వం వెంటనే ఫీజురీయంబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశాయి. లేకపోతే నిరవధిక ఆందోళన చేపడతామని హెచ్చరించాయి. తెలంగాణ ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో విద్యాసంస్థలను కొనసాగించడం చాలా కష్టంతో కూడుకున్నదని ప్రైవేటు విద్యాసంస్థలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలోనే ప్రైవేటు విద్యాసంస్థలపై సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్ అయినట్లు తెలుస్తోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతూ తెలంగాణలో ఉన్నత విద్యాసంస్థలు చేపట్టిన బంద్‌పై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. విడతల వారీగా బకాయిలు చెల్లిస్తామన్నారు. మా హయాంలోని బకాయిలు ముందు

..మిగతా 2లో

## వందేమాతరంతో ఆత్మవిశ్వాసం




**అది భవిష్యత్‌కు సరికొత్త భరోసా**

**వందేమాతరం 150వ స్మారకోత్సవంలో ప్రధాని మోదీ**

హైదరాబాద్,నవంబరు7(ప్రభాత ఉదయం): వందేమాతరం శబ్దం విన్నంతనే మనలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుందని ప్రధాని మోడీ అన్నారు. భవిష్యత్తుకు సరికొత్త భరోసా ఇస్తుందన్నారు. శుక్రవారం దిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో వందేమాతరం 150వ స్మారకోత్సవంలో పాల్గొన్న ప్రధాని మోదీ మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్ల మంది భారతీయుల్లో స్ఫూర్తి నింపిన వందేమాతరం గేయానికి శుక్రవారంతో 150 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఏడాది పొడవునా కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ గేయాన్ని నవంబరు 7, 1875న బంకించంద్ర ఛటర్జీ రచించారు. ఈ గేయం.. తొలిసారి ఛటర్జీ రాసిన 'ఆనంద్ మఠ్' నవలలో ప్రచురితమైంది. వందేమాతరం గేయం ఒక స్వప్నం, ఒక సంకల్పం, ఒక మంత్రం అని ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. అది దేశమాత ఆరాధన, సాధన అని పేర్కొన్నారు. ఈ గేయం మనందరినీ పురాణ ఇతిహాసాల్లోకి తీసుకెళ్తుందని చెప్పారు. ఈ సామూహిక గేయాలాపన అద్భుత అనుభవం. ఒకే లయ, స్వరం, భావంతో గేయాలాపన హృదయాన్ని స్పందింపజేస్తుందని ప్రధాని అన్నారు. వందేమాతరం 150 ఏళ్ల స్మారకోత్సవాలు నిర్వహించుకుంటున్నామని, ఇవి దేశ ప్రజలకు ప్రేరణనిస్తాయని మోదీ అన్నారు. వందేమాతరం స్మారక స్టాంపు, నాణెం విడుదల చేశాం. ప్రతి గీతానికి ఒక మూలభావం, సందేశం ఉంటుంది. మన వందేమాతరం మూలభావం భారత్, మా భారతి అని పేర్కొన్నారు. ఇది దేశానికి ఒక ప్రార్థన లాంటిదన్నారు.. ఇది మనల్ని చరిత్రలోకి తీసుకెళుతుంది. ఇది మన భవిష్యత్తుకు ధైర్యాన్ని ఇస్తుంది. భారతీయులు సాధించలేని సంకల్పం లేదు. సాధించలేని లక్ష్యం లేదని మోడీ పేర్కొన్నారు. నవంబర్ 7 అనేది ఒక చారిత్రాత్మక రోజు అని.. వందేమాతరం ఆవిర్భవించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఘనంగా వేడుకలు జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం కోట్లాది మంది భారతీయుల్లో కొత్త శక్తిని ఉత్పత్తి చేస్తుందని చెప్పారు. వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా ప్రతి పౌరుడికి శుభాకాంక్షలు తెలిపారు. ఇక 1950లో భారతదేశం గణతంత్ర దేశంగా ఆవిర్భవించిన సందర్భంగా ఈ వందేమాతరం గేయాన్ని జాతీయ

..మిగతా 2లో

## జూబ్లీహిల్స్‌లో అధికార దుర్వినియోగం

**కేంద్ర ఎన్నికల సంఘానికి బిఆర్ఎస్ ఫిర్యాదు**



న్యూఢిల్లీ,నవంబరు7(ప్రభాత ఉదయం): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు ఆయన కేబినెట్ సహచరులు కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ ఎంపీ కె.ఆర్.సురేష్ రెడ్డి విమర్శించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ.. అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. అధికార పార్టీకి అనుకూలంగా పోలీసులు వ్యవహరిస్తున్నారని.. ఈ నేపథ్యంలో కేంద్ర బలగాల ఆధ్వర్యంలో ఈ ఉపఎన్నికను నిర్వహించాలని ఈసీని కోరినట్లు ఆయన తెలిపారు. శుక్రవారం న్యూఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం ఉన్నతాధికారులతో బీఆర్ఎస్ ఎంపీలు కె.ఆర్.సురేష్ రెడ్డి, దామోదర్ రావు సమావేశమయ్యారు. ఈ

..మిగతా 2లో



**కర్నూలు బస్సు దగ్ధం కేసు**

## ఓనర్ వేమూరి వినోద్ అరెస్ట్

కర్నూలు,నవంబరు7(ప్రభాత ఉదయం):తెలుగు రాష్ట్రాల్లో పెను ప్రకంపనలు సృష్టించిన వేమూరి కావేరీ ట్రావెల్స్ బస్సు ప్రమాదం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. కర్నూలు జిల్లాలో 19 మంది మృతికి కారణమైన ఈ ఘోర ప్రమాదానికి సంబంధించి వి.కావేరీ ట్రావెల్స్ యజమాని వేమూరి వినోద్ కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో బస్సు డ్రైవర్ మిర్యాల లక్ష్మయ్యను ఎ1 నిందితుడిగా ఇప్పటికే అరెస్టు చేయగా, ట్రావెల్స్ యజమాని వినోద్ కుమార్‌ను ఎ2 నిందితుడిగా పోలీసులు చేర్చారు. ప్రయాణికుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు జిల్లాలోని ఉలిందకొండ పోలీసులు కేసు నమోదు చేశారు. ట్రావెల్స్ ఓనర్ వినోద్ కుమార్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు శుక్రవారం స్పెషల్ మొబైల్ కోర్టులో హాజరుపరిచారు.


## ఫీజు రియంబర్స్‌మెంట్ ఎత్తేసే కుట్ర

**రేవంత్ వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం**

**బకాయిలు చెల్లించకుంటే చదువెలా సాగిస్తారు**

**ప్రైవేట్ కాలేజీలకు మా మద్దతు కొనసాగిస్తాం**

**కేంద్రమంత్రి బండి సంజయ్ వెల్లడి**



హైదరాబాద్,నవంబరు7(ప్రభాత ఉదయం): ఫీజు రియంబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తేసే కుట్రలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నారని, కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు అడిగితే.. ప్రైవేట్ కాలేజీ యజమాన్యాలని సీఎం రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ చేస్తారా..? అని ఫైర్ అయ్యారంటే అరథం చేసుకోవచ్చన్నారు. అసెంబ్లీ సాక్షిగా ప్రతినెలా బకాయిలు చెల్లిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి మాట ఇచ్చింది నిజం కాదా..? అని ప్రశ్నించారు. బకాయిలు చెల్లిస్తామని టోకెన్లు ఇచ్చి మోసం చేసింది నిజం కాదా? అని నిలదీశారు. బకాయిలు చెల్లించకుండా కాలేజీలను మోసం చేస్తోంది నిజం కాదా? అని అన్నారు. శుక్రవారం బీజేపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో బండి సంజయ్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోతే... మరి టోకెన్లు ఎందుకు ఇచ్చినట్లు? అని ప్రశ్నించారు. రాష్ట్ర అసెంబ్లీ సాక్షిగా ఎందుకు హామీ ఇచ్చారని నిలదీశారు. చట్టసభలో ఇచ్చిన హామీకే విలువ లేకుంటే ఇక అసెంబ్లీకి విలువ ఏముందని అడిగారు. సార్వత్రిక ఎన్నికలకు ముందే తెలంగాణ

..మిగతా 2లో

# రాజేంద్రనగర్‌లోని జాతీయ వరి పరిశోధన సంస్థలో రైతు దినోత్సవం



అటారీ డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్ మీరా ను సన్మానిస్తున్న జాతీయ వరి పరిశోధనా సంస్థ డైరెక్టర్ డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం, శాస్త్రవేత్తలు



వరి పంట పొలాలను పరిశీలించి వివరాలను తెలుసుకుంటున్న రైతులు

బుద్వేల్, నవంబరు 7 (ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ లోని జాతీయ వరి పరిశోధన సంస్థ (ఐఐఆర్ఆర్) లో శుక్రవారం నిర్వహించిన రైతు దినోత్సవం లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పం జాబ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి నాలుగు వందల మంది రైతులు పాల్గొని ఐఐఆర్ఆర్ వరి లో చేపడుతున్న పరిశోధనలు, పంట రకాలను, వరి దిగుబడుల గురించి తెలుసుకున్నారు. ఐఐఆర్ఆర్ డైరెక్టర్ డాక్టర్ మీనాక్షి సుందరం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రైతులు నేరుగా పంట పొలాలకు వెళ్లి పరిశీలించి తమకున్న ప్రశ్నలు, అనుమానాలను శాస్త్రవేత్తలనుంచి అడిగి తెలుసుకున్నారు. ఐఐఆర్ఆర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ వి సాయి ప్రసాద్ సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ జ్యోతి బద్రి, డాక్టర్ అబ్దుల్ ఫియాజ్, డాక్టర్ శృతి లు నూతన వంగడాల గురించి రైతులకు వివరించారు. డీఆర్అర్ దాన్ 48, 60, 75, 79 వంటి రకాల పట్ల రైతులు ప్రత్యేక ఆసక్తి చూపారు. త్వరలో అధిక దిగుబడులు ఇచ్చే డీఆర్ఆర్ థాన్ 87 రకాన్ని విడుదల చేయడం జరుగుతుందన్నారు. సంస్థ క్రాప్ ప్రొడక్షన్ విభాగాదిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఆర్ మహేందర్ కుమార్ ఐఐఆర్ఆర్ చేపడుతున్న పరిశోధనలను వివరించారు. కార్యక్రమానికి అగ్రికల్చర్ టెక్నాలజీ అప్లికేషన్స్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (అటారీ) డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్ మీరా ముఖ్య అతిథిగా విచ్చేసి రైతులకు పలు సూచనలు చేశారు. ప్రతి ఏటా తెలంగాణ లో భూగర్భజలాలు 12 మీటర్ల క్రిందకు దిగిపోతున్నాయన్నారు. తక్కువ నీటి తో ఎక్కువ దిగుబడినిచ్చే పద్ధతులైన వెదజల్లే పద్ధతులను రైతులు సొంతం చేసుకోవాలన్నారు. తక్కువ గ్లిజమిక్ ఇండెక్స్, ఎక్కువ ప్రోటీన్లు కలిగి అధిక దిగుబడి ఇచ్చే వరి ఉత్పత్తులను కనుగొంటున్న వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ప్రకృతి ఎన్విరాన్మెంట్ సొసైటీ సీఈఓ జయశ్రీ, తెలంగాణ రాష్ట్ర ఫార్మర్స్ ప్రొడ్యుసర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు ఎస్ జైపాల్ రెడ్డి, డాక్టర్ సీ ఎన్ నీరజ, డాక్టర్ ఎం ఎస్ ప్రసాద్, డాక్టర్ అమూల్ వారిస్, డాక్టర్ కళ్యాణి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ఆదర్శ రైతులను సన్మానించారు.

# ఫీజు రియంబర్స్‌మెంట్ ఎత్తేసే కుట్ర

మొదటి పేజీ తరువాయి...

రూ.7 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని రేవంత్‌రెడ్డే చెప్పారు కదా? అని గుర్తుచేశారు. ఇప్పుడు అందుకు భిన్నంగా మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోతే కాలేజీలు ఎలా నడవాలని నిలదీశారు బండి సంజయ్. అధ్యాపకులకు జీతాలివ్వకపోతే విద్యార్థులకు చదవు చెప్పేదెవరు..? అని అడిగారు. కాలేజీ యాజమాన్యాలపై సీఎంకు ఉన్న కోపంతో.. విద్యార్థుల జీవితాలను బలి చేయాలనుకుంటున్నారా? అని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తేసేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తోందని ఆరోపించారు. చట్టం పేరుతో బెదిరింపులకు పాల్పడితే పాలన నడవదనే విషయాన్ని సీఎం గుర్తుంచుకోవాలని హితవు పలికారు. తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించి చట్టం గురించి మాట్లాడితే మంచిదని సూచించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కొనసాగిస్తారా? ఎత్తి వేస్తారా? ప్రజలకు స్పష్టం చేయాలని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించేదాకా.. విద్యార్థులు, అధ్యాపకులు, కాలేజీ యాజమాన్యాల ఆందోళనకు బీజేపీ మద్దతు కొనసాగుతుందని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు.

# ప్రైవేట్ విద్యాసంస్థల తాట తీస్తా

మొదటి పేజీ తరువాయి...



చెల్లిస్తాం గతంలో ఉన్న బకాయిలపై చర్చిస్తామని అన్నారు. అయితే బందులతో విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడొద్దన్నారు. ఇలా చేయడం విద్యార్థులపై ప్రభావం చూపదా అని అన్నారు. బకాయిలు ఇవాళ కాకపోతే రేపు వసూలవుతాయి. కాలేజీలు బంద్ పెడితే విద్యార్థులు కోల్పోయిన సమయం తిరిగి వస్తుందా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులకు ఇబ్బంది లేదు. అన్ని వర్గాలను సమన్వయం చేసుకుంటూ వెళ్లాలి. రాష్ట్రానికి నెలకు రూ.18వేల కోట్ల ఆదాయం వస్తోంది. జీతాలు, వడ్డీలు, ఇతర ఖర్చులు పోనూ మిగిలేది రూ.5వేల కోట్లే. ఈ ఆదాయంతో రాష్ట్రాన్ని ఎలా నడపాలో చెప్పండి. ప్రభుత్వాన్ని బ్లాక్ మెయిల్ చేస్తున్నారా? కాలేజీలను బంద్ చేయించినవారితో చర్చించేదేముంది? ఏ కాలేజీ ఎంత డొనేషన్ వసూలు చేస్తుందో నాకు తెలుసు. కాలేజీలో నిబంధనలు పాటించకపోతే ఎలా? ఇష్టానుసారం ఫీజులు పెంచుకుంటూ పోతే ఎలా? విద్య వ్యాపారం కాదు.. విద్యను సేవగా భావించాలి. రాజకీయ నేతలు అండగా ఉన్నారని విద్యార్థులతో ఆడుకోవద్దు. అడ్డగోలుగా ఫీజులు పెంచుకుని వచ్చి రీయింబర్స్‌మెంట్ అడుగుతున్నారు. కాలేజీలకు అనుమతుల విషయంలో ఎన్నో అక్రమాలు ఉన్నాయి. కాలేజీల యజమానులు ప్రభుత్వాన్నే బ్లాక్ మెయిల్ చేస్తారా? బీసీ నేత ఆర్.కృష్ణయ్య కూడా అమాయకంగా వాళ్ల ఉచ్చులో పడ్డారు. ఆర్.కృష్ణయ్య, మందకృష్ణ ముందుకొస్తే వాళ్ల చేతికే చిట్టా ఇస్తా. నాలుగు నెలలు ప్రభుత్వాన్ని మీరే నడపండని సీఎం అన్నారు.

# హైదరాబాద్‌ను డ్రగ్స్‌కు అడ్డాగా చేసిన కేటీఆర్

మొదటి పేజీ తరువాయి...

కాంగ్రెస్ వల్లే నగరం అభివృద్ధి చెందింది. ఇప్పుడూ కాంగ్రెస్‌ను గెలిపిస్తే అభివృద్ధి పనులు జరుగుతాయి. అభివృద్ధి పనుల వల్ల పేదలకు నష్టం జరిగితే ఆదుకుంటాం. ఇళ్లు కోల్పోయిన పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తాం. ప్రజలను ఓటు అడుగుతున్నా.. మీ ఓటు ద్వారా హైదరాబాద్‌ను అభివృద్ధి చేసుకుందాం అని సీఎం విజ్ఞప్తి చేశారు. భారత రాష్ట్ర సమితి హయాంలో కాళేశ్వరం, కమాండ్ కంట్రోల్ సెంటర్, సచివాలయం, ప్రగతి భవన్ నిర్మించారు. కుమారుడిని ముఖ్యమంత్రిని చేయాలని, వాస్తు సరిగా లేదని బాగున్న సచివాలయాన్ని కూలగొట్టి.. కొత్తది నిర్మించారు. పేద ప్రజలకు ఆ సచివాలయం వల్ల ఏమైనా ఉపయోగం ఉందా? కొత్త ఉద్యోగాలు ఏమైనా వచ్చాయా? అంటూ ప్రశ్నించారు. ప్రతిపక్షాలు, మీడియా ప్రతినిధులపై నిఘా పెట్టేందుకు కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఎవరికీ అనుమతి లేని విలాసవంతమైన భవనాలు మాత్రమే నిర్మించారు. రైతు కోసమని కట్టిన కాళేశ్వరం మాత్రం మూడేళ్లకే కూలింది. పదేళ్లలో మెట్రో రైలును కొత్తగా కిలోమీటరు కూడా పొడిగించలేదు. మంజూరైన పాతబస్తీ మెట్రోను కూడా పక్కకు పెట్టారు. మెట్రో నిర్మించిన ఎల్ అండ్‌టీ నష్టాలకు కూడా భారత రాష్ట్ర సమితే కారణం అని సిఎం అన్నారు. 2047 నాటికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు కావస్తోంది. భవిష్యత్ ప్రణాళికలు ఎలా ఉండాలో విజన్ డాక్యుమెంట్ తయారు చేస్తున్నాం. మెట్రో విస్తరణకు రూ.43వేల కోట్లతో ప్రణాళికలు కేంద్రానికి ఇచ్చాం. ఆనాడు హైదరాబాద్ అభివృద్ధి కోసం కొట్లాడిన శశిధర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డిని హైదరాబాద్ బ్రదర్స్ అనే వాళ్లు. నేడు హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్న కిషన్‌రెడ్డి, కేటీఆర్‌ను బ్యాడ్ బ్రదర్స్ అంటున్నారు. వీరిద్దరూ కలిసి మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన, రీజినల్ రింగ్ రోడ్డు, ఫ్యూచర్‌సిటీని అడ్డుకుంటున్నారు. గోదావరి జలాలు 20 టీఎంసీలు హైదరాబాద్ నగరానికి తేవాలని ప్రయత్నిస్తుంటే అడ్డుకుంటున్నారు. హైదరాబాద్‌లో నిర్మించాలనుకున్న ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లకు అడ్డంకులు సృష్టిస్తున్నారు. 30 ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న కంటోన్మెంట్ నుంచి శామీర్‌పేట, మేడ్చల్‌కు ఎలివేటెడ్ కారిడార్లకు అప్రూవల్ తెచ్చి రూ.5వేల కోట్లతో పనులు ప్రారంభించాం. ఉత్తర తెలంగాణ మొత్తం ఈ రెండు ఎలివేటెడ్ కారిడార్లపైనే ఆధారపడి ఉంది. పదేళ్లు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి.. వాటి అనుమతులకు ప్రయత్నం చేయలేదని అన్నారు. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల నిర్మాణానికి అనుమతులు తీసుకొచ్చాం. అదనంగా కొత్తగూడెం, రామగుండం ఎయిర్‌పోర్టులకు ప్రయత్నాలు చేస్తున్నాం అని రేవంత్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటి 6 నెలలు పార్లమెంట్ ఎన్నికలతో గడిచిపోయాయి. ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో పనిచేసింది ఏడాదిన్నర మాత్రమే. ఏడాదిన్నరలోనే రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకొచ్చాం. రూ.లక్ష కోట్ల ఆదాయం వచ్చే ఓఆర్ఆర్‌ను కేవలం రూ.7వేల కోట్లకు భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం అమ్ముకుంది. దీపావళి రోజు కూడా ఇళ్లలో డ్రగ్స్‌తో పట్టుబడిన వారిని ఏమనాలన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీకి డిపాజిట్ రాదని... రాసిపెట్టుకోవాలని సీఎం రేవంత్ అన్నారు. బీజేపీ ఓడితే..హిందువులంతా బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నారని ఒప్పుకుంటారా.. బండి సంజయ్ దీనిని రెఫరెండంగా భావిస్తారా అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ లో బీజేపీ గెలవాలని కిషన్ రెడ్డికే లేదన్నారు. బీఆర్ఎస్ ను ఓడించండి..బీజేపీ డిపాజిట్ గల్లంతు చేయాలని పిలుపునిచ్చారు రేవంత్. ఏ ఎన్నికనైనా తాను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటానన్నారు రేవంత్.. పార్టీ అభ్యర్థి ఉన్న చోట తాను పోటీలో ఉన్నట్లే ఫీలవుతా... కేసీఆర్ లా ఫామ్ హౌస్ లో పడుకోవాలా? అని ప్రశ్నించారు. ప్రతీ ఎన్నిక తమ ప్రభుత్వ పనితీరుకు పరీక్షేనన్నారు. అండగా ఉంటే పదేళ్లలో అభివృద్ధి ఏంటో చేసి చూపిస్తానన్నారు. సర్వేల గురించి తాను మాట్లాడనన్నారు రేవంత్..డబ్బులిచ్చి సర్వేలు చేయించుకుంటున్నారని ఆరోపించారు. కిషన్ రెడ్డి..కేసీఆర్, కేటీఆర్‌లకు లొంగిపోయారని విమర్శించారు. హైదరాబాద్‌లో చెప్పుకోదగ్గ ప్రాజెక్టులు ఏమైనా ఉన్నాయంటే..అవి కాంగ్రెస్ తెచ్చినవేనన్నారు.



అగ్రి ఉడాన్ 8.0 ను ప్రారంభిస్తున్న వ్యవసాయ రంగ నిపుణులు

# వ్యవసాయ స్టార్టప్‌లను బలోపేతం చేయడానికి అగ్రి ఉడాన్ 8.0 ప్రారంభం

బుద్వేల్, నవంబరు 7 (ప్రభాత ఉదయం) : భారత దేశంలో వ్యవసాయ, అహార స్టార్టప్ లను శక్తి వంతం చేయడానికి రాజేంద్రనగర్ లోని నేషనల్ అకాడమి ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్మెంట్ (నార్మ్) లో అగ్రి ఉడాన్ 8.0 కార్యక్రమాన్ని ప్రాంరంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ దండ రాజిరెడ్డి, నాబార్డ్ జనరల్ మేనేజర్ ఆర్ గణపతి, అటారి డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్ మీరా, నార్మ్ యాక్టింగ్ డైరెక్టర్ డాక్టర్ గోపాల్ లాల్, నార్మ్ కు చెందిన డాక్టర్ సెంథిల్ వినాయగంలు పాల్గొన్నారు. వ్యవసాయ వ్యాపార కార్యక్రమాలను వేగవంతం చేయడానికి అగ్రి ఉడాన్ 8.0 కార్యక్రమం ఉపయోగపడుతు ందన్నారు. వ్యవసాయ పటుత్వాన్ని పెంపొందించే కొత్త పరిశోధనల ద్వారా భూ సూక్ష్మత విభజన, వాతావరణ మార్పులను తట్టుకోవడానికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు.



పశు వైద్య శిబిరంలో రైతులకు ఔషధాలు, పశు గ్రాసం విత్తనాలను అందిస్తున్న డాక్టర్ బి గోపీ

# పశువైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో గ్రామాలలో మెగా పశువైద్య శిభిరాలు

బుద్వేల్ నవంబరు 7 (ప్రభాత ఉదయం) : పీవీ నర్సింహ్మారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని రాజేంద్రనగర్ పశువైద్య కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం జూలూరు, కాట్రాయిపల్లి, పెద్దగూడెం గ్రామాలలో మెగా పశువైద్య శిభిరం నిర్వహించారు. పశు వైద్య జీవ సాంకేతిక విజ్ఞానశాస్త్ర విభాగం, భారత పశువైద్య మండలి సహకారంతో నిర్వహించిన ఈ వైద్య శిభిరంలో రాష్ట్ర పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ బి. గోపి పాల్గొని ప్రాణాంతక వ్యాధుల నివారణకు పశువులకు టీకాలు ఎంత అవసరమో వివరించారు. పశువుల కోసం ఔషదాలు, గడ్డిమొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్య అధికారి డాక్టర్ జానయ్య, వర్సిటీ డీన్ డాక్టర్ ఉదయ్ కుమార్, రాజేంద్రనగర్ పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ మాధురిలు పాల్గొన్నారు.

# తక్కువ గ్లిజమిక్ ఇండెక్స్, అధిక జింక్ కలిగిన బియ్యం రకాలను ఔట్ లెట్ ద్వారా విక్రయిస్తాం

## ఐఐఆర్ఆర్ డైరెక్టర్ డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం



బుద్వేల్, నవంబరు 7 (ప్రభాత ఉదయం) : తక్కువ గ్లిజమిక్ ఇండెక్స్, అధిక జింక్ కలిగిన డీఆర్అర్ ధాన్ 48 రకాలతో పాటు ప్రోటీన్, మినరల్స్ అధికంగా ఉండే బియ్యం రకాలను రాజేంద్రనగర్ లోని జాతీయ వరి పరిశోధన సంస్థ (ఐఐఆర్ఆర్) ఆరవణలో ఏర్పాటు చేసే ఔట్ లెట్ ద్వారా విక్రయించడం జరుగుతుందని ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం తెలిపారు. అందుకోసం సన్నాహాలు జరుగుతున్నాయని, రెండు మూడు నెలల తర్వాత ఔట్ లెట్ అందుబాటులోకి రానుందన్నారు. ఈ ఔట్ లెట్ ద్వారా వరి ఉత్పత్తులకు సంబందించిన అన్ని రకాలను రైతులకు, ప్రజలకు అందుబాటులో ఉంచుతామన్నారు. రెండు రోజుల పాటు రాజేంద్రనగర్ లో జరిగిన వరి ఇండస్ట్రీ మీట్, రైతు దినోత్సవం సందర్భంగా ఆయన ఈ విషయాలను తెలియజేశారు.



# వందేమాతరంతో ఆత్మవిశ్వాసం

మొదటి పేజీ తరువాయి...

గేయంగా గుర్తించారు. ఇదిలా ఉంటే కేంద్ర ప్రభుత్వం ఈ 2025 సంవత్సరాన్ని 150 ఏళ్ల 'వందే మాతరం'గా పరిగణించింది. ఈ రోజు నుంచి వచ్చే ఏడాది 2026, నవంబర్ 7 వరకు దేశవ్యాప్తంగా వందేమాతరం జాతీయ గేయం సంస్మరణోత్సవాలను జరపాలని నిర్ణయించింది.

# జూబ్లీహిల్స్‌లో అధికార దుర్వినియోగం

మొదటి పేజీ తరువాయి...

సందర్భంగా ఈ ఉప ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు వ్యవహరిస్తున్న తీరును వారికి వివరించి.. ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకర్లతో ఎంపీ కె.ఆర్.సురేష్ రెడ్డి మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారని.. దాంతో అక్కడ మహిళా అధికారులను నియమించాలని సీఈసీని కోరినట్లు తెలిపారు. అలా కాకుంటే దొంగ ఓట్లు వేసే అవకాశం ఉందని ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత మాగంటి గోపినాథ్ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అనివార్యమైంది. నవంబర్ 11వ తేదీన ఈ ఉప ఎన్నిక జరగనుంది. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు.. తమ తమ అభ్యర్థులను రంగంలోకి దింపాయి. ఈ ఉప ఎన్నికల్లో గెలుపు కోసం ఆయా పార్టీలు పక్కా వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తున్నాయి. ఆ క్రమంలో అధికార పార్టీ హామీల వర్షం కురిపిస్తోంది. ఇక ప్రతిపక్షలు బీఆర్ఎస్, బీజేపీలు.. అధికార పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయలేదంటూ విమర్శలు గుప్పిస్తున్నాయి. దీంతో ఈ మూడు పార్టీలు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నాయి. అయితే అధికార కాంగ్రెస్ పార్టీ ఈ ఉపఎన్నికల్లో గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అందుకోసం మంత్రులు, అగ్రనేతలను ఈ నియోజకవర్గంలోని డివిజన్లకు ఇన్‌ఛార్జులుగా నియమించి.. గెలుపు కోసం కృషి చేయాలని పార్టీ అధిష్ఠానం ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది.



వ్యవసాయ విశ్వ విద్యాలయం లో వందే మాతరం గీతం ఆలపిస్తున్న అధికారులు, ఉద్యోగులు

# వందేమాతరం గీతాన్ని ఆలపించి దేశభక్తిని చాటుకున్న ప్రజలు



హైదర్ గూడ లో వందే మాతరం గీతం ఆలపిస్తున్న బీజేపీ నాయకులు, పుర ప్రముఖులు



అత్తాపూర్ న్యూ బ్రిలియంట్ హై స్కూల్ లో వందే మాతరం గీతం ఆలపిస్తున్న విద్యార్థులు

బుద్వేల్, నవంబరు 7 (ప్రభాత ఉదయం) వందే మాతరం గీతం ఆలపించడం ప్రారంభించి 150 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా రాజేంద్రనగర్ లోని ప్రభుత్వ కార్యాలయాలలో, కాలనీలు, బస్తీల కూడళ్లలలో అధికారులు, ప్రజలు, వివిధ పార్టీల నాయకులు వందేమాతరం గీతాన్ని ఆలపించి దేశభక్తిని చాటుకున్నారు.

# జీవ వ్యర్థాల నుంచి ఆరు గంటల్లో జీవ ఎరువుల తయారీ

**వియత్నాం సంస్థతో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం**

**హాజరైన వియత్నాం డిప్యూటీ అంబాసిడర్ ట్రాన్ తన్వా టంగ్**

**యూరియా కు రానున్న ఏళ్లల్లో ఇదే ప్రత్యామ్నాయం : వీసీ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య**

బుద్వేల్, నవంబరు 7 (ప్రభాత ఉదయం) – వ్యవసాయ, ఉద్యాన పంటల వ్యర్థాలు, మాసం వ్యర్థాలు, గుర్రపు డెక్క తదితర అన్ని జీవ వ్యర్థాలనుంచి జీవ ఎరువులను ఆరు గంటల్లో తయారు చేసే పరిజ్ఞానాన్ని, యంత్ర పరికరాన్ని బయో వియత్నాం సంస్థ నుంచి ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ఉచితంగా అందించే అవగాహన ఒప్పందం పై రెం డు సంస్థలు శుక్రవారం ఒప్పందం కుదుర్చుకున్నాయి. తెలంగాణ కు చెందిన పీజేటీఏయు తో వియత్నాం కుదుర్చుకున్న ఈ ఒప్పందం భారత దేశంలోనే తొలిసారి అని భారతదేశంలోని వియత్నాం డిప్యూటీ అంబాసిడర్ ట్రాన్ తనా టంగ్, బయో వియత్నాం సీ ఈ ఓ లీ తీ కామ్ టెన్ తెలిపారు. భారత్ లోని వియత్నాం రాయభార కార్యాలయం డిప్యూటీ రాయబారి ట్రాన్ తన్వా టంగ్, వియత్నాం దేశానికి చెందిన బయో వే వియత్నాం సీఈఓ లీ




జీవ వ్యర్థాల నుంచి జీవ ఎరువుల తయారీ పై అవగాహన ఒప్పందం కుదుర్చుకుంటున్న వ్యవసాయ వర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య, బయో వే వియత్నాం సీఈఓ లీ తీ కామ్ టెన్, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ లు

తీ కామ్ టెన్ తమ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందంతో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. పరిపాలన భవనంలో ఉప కులపతి ప్రొఫెసర్ ఆల్టాస్ జానయ్య తో భేటీ అయ్యారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ ఇతర విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు ఈ భేటి లో పాల్గొన్నారు. ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా 12 దేశాలతో ఒప్పం చాలు కుదుర్చుకున్నామని. ఇది 13వ ఒప్పందం అని వియత్నాం ప్రతినిధి బృందం సభ్యులు తెలిపారు. ఎన్నో ఏళ్ల పరిశోధనల తర్వాత ఈ పరిజ్ఞానాన్ని ఈ సంస్థ కనుగొన్నదని వ్యవసాయ వర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య తెలిపారు. జీవ వ్యర్థాల నుంచి జీవ ఎరువులు ఇప్పటికే తయారు చేస్తున్నారని, కానీ ఆ ఎరువుల తయారీ కి అనేక రోజుల సమయం పడుతుందని. ఈ సంస్థ అందించే పరిజ్ఞానంతో ఆరు గంటల లోనే జీవ ఎరువులు తయారౌతాయని ప్రొఫెసర్ జానయ్య వివరించారు. రాష్ట్రంలో యూరియ వినియోగం చాలా అధికమైందని, ఆ వినియోగం తగ్గించుకోవల్సిందిగా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో రైతులలో అవగాహన తీసుకురావడానికి విశ్వవిద్యాలయం కృషి చేసిందని ఆయన తెలిపారు. అయితే రైతులు యూరియ కు ప్రత్యామ్నాయం అడుగుతున్నారని జానయ్య తెలిపారు. ఈ జీవ ఎరువులు అం దుకు తగిన ప్రత్యామ్నాయమని ప్రొఫెసర్ జానయ్య వివరించారు. విశ్వవిద్యాలయంలో బయో వే వియత్నాం రెండేళ్ల పాటు ఉచితంగా యంత్రాలను ఏర్పాటు చేస్తుందని ప్రొఫెసర్ జానయ్య తెలి పారు. రెండేళ్ల తర్వాత ఈ జీవ ఎరువుల ఉత్పత్తులను అన్ని కోణాల నుంచి విశ్వవిద్యాలయం మదింపు చేసి రైతాంగానికి పెద్ద ఎత్తున అందించడానికి కృషి చేస్తామన్నారు. జీవ వ్యర్థాలను జీవ ఎరువుల తయారీకి వినియోగించడు వల్ల ప్రకృతిలో కాలుష్యం తగ్గుతుందని, రైతులు రసాయనిక ఎరువులు వాడకం తగ్గిస్తారని జానయ్య విశ్వాసం వ్యక్తం చేశారు. అంతేకాకుండ ప్రభుత్వాలపై రాయితీల భారం తగ్గుతుందని, భూసార క్షీణత తగ్గుతుందన్నారు.



## ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 7(ప్రభాత ఉదయం) ఈనెల 8 నుండి 10 వరకు నారాయణపేట డిస్ట్రిక్ట్ కోస్గి మండలం లో నిర్వహించు ఎస్ జీ ఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్-17 హ్యాండ్ బాల్ పోటీలకు గద్వాల్ మైనారిటీ రెసిడెన్సియల్ స్కూల్ విద్యార్థిని అజ్ మబి బేగం ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ భవాని, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ రాధ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని వారు అభినందించారు.



వందేమాతరం గేయాలాపనలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

## కలెక్టరేట్‌లో "వందేమాతరం" గేయాలాపన

జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 07(ప్రభాత ఉదయం): స్వాతంత్ర ఉద్యమంలో ప్రజల్లో స్ఫూర్తి నింపిన వందేమాతరం గేయానికి 150 యేండ్లు పూర్తయింది. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల్లో శుక్రవారం ఉదయం సామూహికంగా వందేమాతరం గేయాలాపన చేయాలన్న ప్రభుత్వ ఉత్తర్వు మేరకు జనగామ జిల్లా కలెక్టరేట్లో వందేమాతరం గేయాన్ని ఉద్యోగులు ఆలపించారు. ఈ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అడిషనల్ కలెక్టర్లు పింకేష్ కుమార్, బెన్ష లోమ్, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆపన్న హస్తం అందించండి

**స్కిన్ డిసీస్ సోకడంతో ట్రీట్మెంట్ తీసుకుంటున్న ఎర్రవల్లి గ్రామానికి చెందిన కార్తిక్**

**ట్రీట్మెంట్ కోసం సుమారు రూ. 40లక్షలు వరకు ఖర్చుఅవుతుందన్న వైద్యులు**

**రోజు రూ. 2లక్షల ఖర్చు చేస్తేనే ప్రాణం నిలుస్తుందని డాక్టర్ల నిర్ధారణ**

**దాతలు ఆదుకోవాలని కుటుంబ సభ్యుల విజ్ఞప్తి**




గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 7(ప్రభాత ఉదయం) గద్వాల మండలం పూడూరు ఎర్రవల్లి గ్రామానికి చెందిన కార్తిక్ గద్వాల పట్టణంలోని విశ్వం అక్షర స్కూల్ లో 5వ చదువుతున్నాడు. గత వారం రోజుల నుండి స్కిన్ డిసీస్ వ్యాధితో బాధపడుతున్న కార్తిక్ చికిత్స తీసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నాడు. ప్రస్తుతం హైదరబాద్ లోని రేయిన్ బో హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు. ప్రతి రోజు కార్తిక్ కు అయ్యే ట్రీట్మెంట్ ఖర్చు రూ. 2 వరకు హాస్పిటల్ బిల్లు అవుతోందని కుటుంబ సభ్యులు తెలిపారు. పూర్తిగా వైద్యం అందించి బాబు ప్రాణం కాపాడాలంటే రూ. 35-40లక్షలు ఖర్చు చేస్తే గాని బతకని పరిస్థితి. కానీ ట్రీట్మెంట్ ఇప్పించేందుకు పిల్లోడి తల్లిదండ్రులు ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. హైదరాబాదులోని రేయిన్ బో ఆస్పత్రిలో ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్న కార్తిక్ కు కొంతమంది దాతలు సహాయంతో ట్రీట్మెంట్ తీసుకుంటున్నాడు. అయినా ట్రీట్మెంట్ కోసం ఇంకా చాలా డబ్బు కావాల్సి ఉంది. ఎవరైనా దాతలు ఆదుకొని బాబుకు ట్రీట్మెంట్ ఇప్పించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

తండ్రి పేరు సురేష్: 9704630333, 8328676519ం



ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను ఓటు అభ్యర్థిస్తున్న టీఆర్ఎస్ నాయకుడు ఆదర్శ్ రెడ్డి

## బిఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపు అభివృద్ధి మలుపు

**పటాన్ చెరు బిఆర్ ఎస్ ఇంఛార్జి ఆదర్శ్ రెడ్డి**

పటాన్ చెరు, నవంబర్ 7 (ప్రభాత ఉదయం) : జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి జరగాలంటే బిఆర్ ఎస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని ఎర్రగడ్డ డివిజన్ పరిధిలోని జమా మస్జిద్ ప్రాంగణంలో ప్రచారంలో పాల్గొన్న పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి చెప్పారు , బూత్ ఇన్‌చార్జ్‌లు మరియు మైనార్టీ నాయకులతో ఆయన కలిసి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే ప్రజా సేవా దృక్పథం కలిగిన నాయకత్వం అవసరమని పేర్కొన్నారు. ఆ బాధ్యతను సమర్థంగా నిర్వర్తించగల నాయకురాలు మాగంటి సునీత అని ఆయన తెలిపారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తోందని, ముఖ్యంగా మైనార్టీ సమాజ అభివృద్ధికి కేటీఆర్ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో జిన్నారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జగన్నాథ్ రెడ్డి, మైనార్టీ నాయకులు ఉమర్, ఇతర మైనార్టీ నాయకులు, బూత్ ఇన్‌చార్జ్‌లు, స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, మైనార్టీ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



వందేమాతరం సామూహిక గీతాలాపన చేస్తున్న విద్యార్థులు


## ఘనంగా ముగిసిన వందేమాతరం సామూహిక గీతాలాపన

పటాన్ చెరు, నవంబర్ 7(ప్రభాత ఉదయం) : వందేమాతరం గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, అన్ని పాఠశాలలో శుక్రవారం ఉదయం 10 గంటలకు వందేమాతర గీతాలాపన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో వందేమాతర గేయాన్ని సామూహికంగా ఆలపించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలంటూ అన్ని మండలాల విద్యాధికారులకు అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు గురువారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. విద్యార్థులు, ఉద్యోగులు,అధికారులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారస్థులు, ప్రజలు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భాగస్వాములై విజయవంతం చేసారు.



## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలి

**మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి.చంద్రారెడ్డి**



పటాన్ చెరు, నవంబర్ 7 (ప్రభాత ఉదయం): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ శ్రేణులు జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా శుక్రవారం నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్'లతో కలిసి రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు, బొల్లారం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరిస్తూ ఓట్లను అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీ తోనే జూబ్లీహిల్స్ మరింత అభివృద్ధి సాధిస్తుందని, చేయి గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో నవీన్ యాదవ్ ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బొల్లారం మున్సిపల్ నాయకులు సంపత్ రెడ్డి, వెంకటయ్య, మాజీ వార్డు సభ్యులు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చండీయాగం

**శ్రీ భవానీ శంకర స్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక పూజలు**

పటాన్ చెరు, నవంబర్ 7 (ప్రభాత ఉదయం) : శ్రీ భవానిశంకర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ద్వారాతోరణ పూజ, మూలమంత్ర హెూమాలు,చండీ హెూమం,బలిహారణ ద్వారాతోరణ పూజ, ఎదురుకోల్లోత్సవం పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నాగార్జునా చార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమంలో జిన్నారం మాజీ జడ్పీటీసీ మరియు ఆలయ కమిటీ చైర్మన్ కొలన్ బాల్ రెడ్డి, జిన్నారం మాజీ ఎంపీపీ కొలన్ రవీందర్ రెడ్డి, కొలన్ నరేందర్ రెడ్డి, మరియు ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



వడ్ల తేమ శాతాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

**కొనుగోలులో ఆలస్యం ఉండద్దు:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 07(ప్రభాత ఉదయం): జిల్లా లోని రఘునాథపల్లి మండల కేంద్రంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శుక్రవారం ఆకస్మికం గా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కేంద్రం లో నిర్వహిస్తున్న వివిధ రిజిస్టర్ లను పరిశీలించి, ఎప్పటికప్పుడు వచ్చే ధాన్యం వివరాలను అలాగే కొనుగోలు అయిన వివరాలను రిజిస్టర్ లో నమోదు చేయాలన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో.తేమ వచ్చిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా కొనుగోలు చేసి, ట్యాగ్ చేసి మిల్లు లకు తరలించాలన్నారు.రైతులు సరిపడా టార్పాలిన్ లను అందుబాటులో పెట్టుకోవాలని, వర్షం వచ్చే సూచనలు తెలిసినప్పుడు కేంద్రం లో ఉన్న ధాన్యం తడవకుండా వెంటనే తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పరిశీలన లో కలెక్టర్ వెంట మండల తహసీల్దార్ ఫణి కుమార్, ఐకేపీ సెంటర్ నిర్వాహకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్మికుల సమస్యల పైన వినతిపత్రం ఇస్తున్న ప్రవీణ్

## స్టేషన్ ఘనపూర్ మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**బహుజన్ సమాజ్ పార్టీ స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు జలగం ప్రవీణ్**

**పలు సమస్యల పైన జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం**

జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 07(ప్రభాత ఉదయం): జిల్లా లోని స్టేషన్ ఘనపూర్ మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పైన, వారి జీతాలు పెండింగ్ తదితర సమస్య పరిష్కారం కోసం జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ కు తన కార్యాలయం లో శుక్రవారం బహుజన్ సమాజ్ పార్టీ స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు జలగం ప్రవీణ్ వినతి పత్రం అందజేసారు. ఈ సందర్బంగా కలెక్టర్ స్పందించి మున్సిపల్ కార్మికులు సమస్యలను త్వరలోనె పరిష్కరిస్తారని చెప్పారని అన్నారు.



# సైబరాబాద్‌లో వందేమాతరం సామూహిక గీతాలాపన



వందేమాతరం గీతం ప్రముఖ్యతను వివరిస్తున్న అడిషనల్ డీసీపీ సమీర్



వందేమాతరం గీతాలాపన చేస్తున్న పోలీసులు.

శేరిలింగంపల్లి,నవంబర్7, (ప్రభాత ఉదయం) వందేమాతరం జాతీయ గేయం150 సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ స్టేషన్ లలో గీతాలాపన చేశారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ లోని పరేడ్ గ్రౌండ్ వందేమాతరం గేయాన్ని పోలీసులు సామూహిక గానం చేశారు. సైబరాబాద్ సిఏఆర్ హెడ్‌క్వార్టర్స్ ఏడీసీపీ జె ఎస్ కె షమీర్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్, సిఏఆర్ హెడ్‌క్వార్టర్స్ పోలీస్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. పోలీస్ సిబ్బంది వందేమాతరం గీతాన్ని ఆలపించి జాతీయ గీతానికి ఉన్న ప్రాధాన్యతను వివరించారు. స్వాతంత్ర్య సమరంలో వందేమాతరం గీతం ప్రేరణగా నిలిచిందని తెలిపారు. వందేమాతరం దేశ ఐక్యతను బలోపేతం చేసి స్ఫూర్తినిచ్చిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఏసీపీ అరుణ్ లా అండ్ ఆర్డర్ ఆర్ఐలు శేఖర్, వెంకటరమణ, అనిల్ కుమార్, ఆర్ఎస్‌లు పలువురు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## రోడ్లమీద చిత్తవేయకుండా ప్రజలలో అవగాహన కల్పించాలి

### ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

కూకట్ పల్లి, నవంబర్ 7 (ప్రభాత ఉదయం)శేరిలింగంపల్లి నియోజకవర్గం, అల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని పీజేఆర్ నగర్, గురుగోవింద్ సింగ్ నగర్ లలో డ్రైనేజీ లైన్ పుడుకపోయి డ్రైనేజి నీరు రోడ్డుపైన పొంగుతుదన్న విషయాన్ని డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకురాగా కార్పొరేటర్ జిహెచ్ఎంసి సిబ్బందితో ఎయిర్ టెక్ యంత్రం సహాయంతో పూడికను తీయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో పారిశుధ్య సమస్య ఎక్కువగా ఉ ందని అన్నారు. చెత్తను రోడ్ల మీద లేదా బిల్డింగ్ ల మధ్యలో వేయడం వల్ల మీరు మీ పిల్లలు రోగాల బారిన పడే అవకాశం ఉంది కాబట్టి.. మీరందరు మీ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుని, తడిచెత్తా, పొడిచెత్తను వేరువేరుగా బస్తీకి వచ్చి చెత్త సేకరించే ఆటోలలో మాత్రమే వేయాలని సూచించారు. చెత్తను నాలాలలో గాని, రోడ్లమీద గాని, చెరువులలో గాని వేయవొద్దని ప్రజలను కోరారు. సిబ్బంది, కాలనీ అసోసియేషన్ సభ్యులు కలిసికట్టుగా పనిచేసి చెత్తను రోడ్లమీద వేయకుండా ప్రజలలో అవగాహన తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో పోశెట్టిగౌడ్, రాందాస్ గౌడ్, యాదగిరి, సంగమేష్, రాజుగౌడ్, సత్యరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## జలమండలిలో ఘనంగా వందే మాతరం గీతాలాపన

ఖైరతాబాద్, నవంబర్ 7(ప్రభాత ఉదయం) వందేమాతరం గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జలమండలి ప్రధాన కార్యాలయంలో శుక్రవారం అధికారులు, సిబ్బంది వందేమాతర గీతం ఆలపించారు. ఈ కార్యక్రమానికి జలమండలి పర్సనల్ డైరెక్టర్ మహమ్మాద్ అబ్దుల్ ఖాదర్, ప్రాజెక్టు డైరెక్టర్లు సుదర్శన్, శ్రీధర్,ఫైనాన్స్ డైరెక్టర్ పద్మావతి హాజరై.. వందే మాతరం గేయాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



## రాజేంద్రనగర్, సైబర్ సిటీ విద్యుత్ సర్కిల్ కార్యాలయాలలో ఘనంగా వందేమాతరం గీతాలాపన

మెహదీపట్నం, నవంబర్ 7(ప్రభాత ఉదయం) వందేమాతరం గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాజేంద్రనగర్, సైబర్ సిటీ కార్యాలయంలలో శు క్రవారం అధికారులు, సిబ్బంది వందేమాతర గీతం ఆలపించారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ ఎస్ ఈ శ్రీరామ్మోహన్, సైబర్ సిటీ సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ ఎంపీ రవికుమార్, రాజేంద్రనగర్ సర్కిల్ ఇంచార్జ్ ఎస్ ఏ ఓ కొండారెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్లు మురళి గౌడ్, శేఖర్ లు అధికారులు ఇబ్బందితో కలిసి వందే మాతరం గేయాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య

బుద్వేల్, నవంబరు 7 (ప్రభాత ఉదయం): ఆర్థిక ఇబ్బందులు తాళలేక సెక్యూరిటీ గార్డుగా పనిచేసే గణేశ్ సింగ్ (60) అనే వ్యక్తి తాను అద్దెకుంటున్న ఇంటి బాల్కని లో ఇనుప చువ్వకు తాడుతో ఉరి వేసుకుని గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఈ విదంగా ఉన్నాయి... కామారెడ్డి ప్రాంతానికి చెందిన గణేశ్ సింగ్ కుటుంబ సభ్యులతో కలసి శివరాంపల్లి వీకర్ సెక్షన్ కాలనీ లో నివాసం ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇంట్లో చిన్న చిన్న గొడవలు జరుగుతున్నాయి. మనస్థాపానికి గురైన గణేశ్ సింగ్ గురువారం రాత్రి బాల్కని లోని ఇనుప చువ్వకు తాడు తో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శు క్రవారం ఉదయం గణేశ్ సింగ్ కుటుంబ సభ్యులు అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గణేశ్ సింగ్ మృతదేహాన్ని పోస్టుమార్గం నిమిత్తం ఉస్మానియా మార్చ్యురికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## తన కుమారుని మరణంపై అనుమానాలున్నాయి

### డ్రగ్స్ ఓవర్ డోస్ తీసుకోవడంతో మరణించిన మహ్మద్ అహ్మద్ తండ్రి మహ్మద్ మియా

బుద్వేల్, నవంబరు 7 (ప్రభాత ఉదయం):తన కుమారుని మరణంపై అనుమానాలున్నాయని డ్రగ్స్ ఓవర్ డోస్ తో మృతి చెందిన మహ్మద్ అహ్మద్ (26) తండ్రి మహ్మద్ మియా రాజేం ద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాతబస్తీ జహనూమ కు చెందిన మహ్మద్ అహ్మద్ రాజేంద్రనగర్ సర్కిల్ బవానీ కాలనీ లో గల కెన్వర్త్ అపార్ట్ మెంట్ లో రెండు నెలలుగా అద్దెకు టున్నాడు. టవర్ – 1 ఫ్లాట్ 805 లో కర్నూల్ కు చెందిన షేక్ జారా (20) తో సహజీవనం చేస్తున్నాడు. మహ్మద్ అహ్మద్ బుదవారం రాత్రి తన గది లో డ్రగ్స్ ఓవర్ డోస్ తీసుకోవడం వల్ల మరణించిన సంగతి తెలిసిందే. అదే ఇంట్లో సులేమాన్నగర్ చింతల్మెంట్ కు చెందిన సయ్యద్ బిన్ సలామ్ (23), ఆ పోర్షన్ లోని మరో గది లో కలకత్తాకు చెందిన మోమతా బిస్వాస్ అనే మహిళ ఉంటుండడం తెలిసిందే. మొమత బిస్వాస్ భర్త కల్కత్తాకు వెళ్లగా ఆమె ఒంటరిగా ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనలో పోలీసులు డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా సయ్యద్ బిన్ సలామ్ తో పాటు షేక్ జారా కు కూడా పాసిటివ్ వచ్చింది.. మరణించిన మహ్మద్ అహ్మద్ పోస్టుమార్షం నివేధిక ఇంకా రాలేదని పోలీసులు తెలిపారు.

## ఎర్రకుంట చెరువులో పడి ఓ వ్యక్తి మృతి

బుద్వేల్, నవంబరు 7 (ప్రభాత ఉదయం) : పద్మశాలిపురం బస్తీని అనుకున్న ఎర్రకుంట చెరువులో జల్పల్లి శ్రీరాంకాలనీ కి చెందిన ఆటో డ్రైవర్ గుజ్జారి అశోక్ (36) పడి మరణించాడు. శుక్రవారం మద్యాహ్నం రెండు గంటల కు చెరువులో ఓ వ్యక్తి మృతదేహం తేలియాడుతుండటం చూసిన స్థానికులు మైలా□వుపల్లి పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు వచ్చి మృ తదేహాన్ని గుర్తించారు. గుజ్జారి అశోక్ వారం రోజులుగా ఇంట్లో గొడవ పడుతు నేను చని పోతాను అని చెబుతున్నాడని పోలీసుల విచారణలో తేలింది. ఈ నెల 5న ఇంట్లోనుంచి బయటకు వచ్చిన ఆయన ఎర్రకుంట లో పడి ఉంటాడని అనుమానిస్తున్నారు. అశోక్ మిస్సింగ్ కోసం పహడీషరీఫ్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆయన మృతదేహం మైలార్ దేవుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎర్రకుంట లో లభ్యం అవడంతో ఆయన అన్న గుజ్జారి రమేశ్ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మైలాందేవుపల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## అగి ఉన్న ఆర్టీసీ బస్సును ఢీ కొట్టిన డీసీఎం వ్యాను

బుద్వేల్, నవంబరు 7 (ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ సర్కిల్ ఆరాంఘర్ చౌరస్తాలో ఆగి ఉన్న ఆర్టీసీ బస్సు (టీఎస్ 07 యుఎెం 0713) ను వెనుకాల నుంచి వచ్చిన డీసీఎం వ్యాను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. బస్సు మాత్రం ధ్వంసమైంది. వివరాలు ఈ విదంగా ఉ న్నాయి... షాద్ నగర్ నుంచి ఆరాంఘర్ వస్తున్న ఆర్టీసీ బస్సు శుక్రవారం ఉదయం ఆరాంఘర్ చౌరస్తా వద్ద ఆగి ఉంది. వెనుకాల నుంచి వేగంగా వచ్చిన డీసీఎం వ్యాను ఆర్టీసీ బస్సును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు ధ్వంసమైంది. ఆర్టీసీ డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసు న్నారు.





అల్వాల్ రైతు బజార్ ఎదురుగా ఆర్యన్ కేఫ్‌ను ప్రారంభిస్తున్న డీకే అరుణ

## విద్యావంతులైన ప్రతి ఒక్కరు ఉపాధి రంగాలపై దృష్టి సాధించాలి:ఈటల రాజేందర్

మేడ్చల్ జిల్లా ప్రతినిధి (అల్వాల్ సర్కిల్ ) నవంబర్ 07 (ప్రభాత ఉదయం) విద్యావంతులైన ప్రతి ఒక్కరు నిరుద్యోగులుగా మారకుండ ఉపాధి రంగాలపై దృష్టి సారించాలని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. అల్వాల్ రైతు బజార్ ఎదురుగా ఆర్యన్ కేఫ్ ను ప్రారంభించారు. మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్, మహబూబ్ నగర్ పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ, రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్ నిర్వాహకులు శైలేందర్ రెడ్డి కీర్తి రెడ్డి, నరసింహారెడ్డిలతో కార్యక్రమంలో పాల్గొన్నారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...విద్యావంతుడైన ప్రతి ఒక్కరు నిరుద్యోగులుగా మారకుండా ఉపాధి రంగాలపై దృష్టి సారించాలని వారు అన్నారు. నాణ్యతను పాటిస్తూ కస్టమర్ లను సంతృప్తి పడేవిధంగా కస్టమర్లకు మంచి ప్రాధాన్యతను కల్పించాలని నిర్వాహకులకు వారు సూచించారు.వినియోగదారుల అభిరుచి మేరకు నడుచుకోవాలని ఆర్గనైజర్స్ కుతెలిపారు.ఈకార్యక్రమంలో నిర్వాహకుల కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు



## "కాటేదాన్ దక్కన్ శబరి పీఠం నుంచి శబరిమలకు సువర్ణ భూమి మహా పాదయత్ర ప్రారంభం"

### - సుప్రసిద్ధ శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో 11వ తేదీన 18వ మహాపడి పూజ

### - వేముల వెంకటేష్ నారికేళ గురుస్వామి వెల్లడి

రాజేంద్రనగర్ , నవంబర్ 7(ప్రభాత ఉదయం)దక్కన్ శబరి పీఠంగా భక్తులచే ప్రసిద్ధిగాంచిన కాటేదాన్ మణికంఠ హిల్స్ లోని శ్రీ అయ్యప్ప దేవాలయం నుంచి కేరళలోని శబరిమలకు సువర్ణభూమి మహా పాదయాత్ర ఈ నెల 8వ తేదీన ప్రారంభం అవుతుందని ఆలయ ఫౌండర్ సభ్యలు వేముల వెంకటేష్ గురుస్వామి తెలిపారు. తాను 18వ సంవత్సరం అయ్యప్ప మాలాధారణ చేసిన శుభ సందర్భంగా నారికేళ గురుస్వామిగా ఈ నెల 11వ తేదీన మహాపడి పూజ కార్యక్రమాన్ని నిర్వహింస్తున్నట్లు ఆయన చెప్పారు. ఆదివారం కాటేదాన్ శ్రీ అయ్యప్ప ఆలయం నుంచి సువర్ణభూమి మహా పాదయత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో మాలాధారణ చేసిన స్వాములు ప్రత్యేక పూజల అనంతరం నడక యాత్ర ప్రారంభిస్తారని,11వ తేదీన మహబూబ్ నగర్ జిల్లాలోని కందూర్ లో గల సుప్రసిద్ధ శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం ప్రాంగాణంలో 18వ మహాపడి పూజ ఉంటుందన్నారు. ఆయా కార్యక్రమాలలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్, మాజీ కార్పొరేటర్ టి. ప్రేమ్ దాస్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సానెం శ్రీనివాస్ గౌడ్, దక్కన్ శబరి పీఠం అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు సంరెడ్డి ప్రమోద్ రెడ్డి, ప్రతినిధులు రాము గౌడ్, అర్థం శ్రీనివాస్ గుప్త, సంకూరి జయప్రకాష్, పులిజాల వివేకానంద, సంతోష్ గుప్త, నర్సిరెడ్డి, సారంగ రవికుమార్ తో పాటు సానెం నర్సింగ్ గౌడ్, వెంకటేష్ గౌడ్, టి.ప్రేమ్ గౌడ్, అశోక్ సాగర్, బాస శ్రీనివాస్, గట్టయ్య, పాము శేఖర్, సంకూరి శ్రీకాంత్ తదితరులు పాల్గొంటారని వేముల వెంకటేష్ నారికేళ గురుస్వామి పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో మహా పాదయాత్ర ప్రారంభ పూజ తోపాటు 18వ మహా పడిపూజ కార్యక్రమాలకు హాజరై ఆ అయ్యప్ప స్వామి కృపకు పాత్రులు కాగలరని ఆయన కోరారు.



## జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో భాగంగా మున్నూరు కాపు కాపు ఆత్మీయ సమావేశం

### హాజరైన జనసేన నాయకులు ముమ్మారెడ్డి ప్రేమ కుమార్

కూకట్ పల్లి, నవంబర్ 7 (ప్రభాత ఉదయం)జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని కూకట్ పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ అధ్యక్షుడు ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ అన్నారు. గురువారం మోతినగర్ కమ్యూనిటీ హాల్ జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో భాగంగా మోతి నగర్ కమ్యూనిటీ హాల్లో బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి ని గెలిపించటానికి బిజెపి ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో మున్నూరు కాపు, కాపు ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్, విశిష్ఠ అతిధి గా జనసేన పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గం ఇంచార్జి ముమ్మారెడ్డి ప్రేమకుమార్ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ జనసేన పార్టీ బీజేపీతో కలసి జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో విజయం సాధించేందుకు అన్ని స్థాయిల్లో కృషి చేస్తోంది. ఈసారి ఉమ్మడి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి ని నవంబర్ 11న జరిగే ఉప ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన కో ఆర్డినేటర్లు, ప్రెసిడెంట్లు, జనసేన నాయకులు, కార్యకర్తలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో 'వందే మాతరం' 150 ఏళ్ల సంస్మరణోత్సవం

### నేటికీ దేశ కీర్తిని, ఐక్యతను పెంపొందిస్తున్న మన జాతీయ గేయం వందేమాతరం

### జాతీయ గేయాన్ని దేశభక్తికి శాశ్వత చిన్నంగా నిల్చలా చేసింది బంకించంద్ర ఛటర్జీ:బాలానగర్ సిఐ నర్సింహా రాజు

కూకట్ పల్లి, నవంబర్ 7 (ప్రభాత ఉదయం) జాతీయ గేయం 'వందేమాతరం' 150వ సంస్మరణ కార్యక్రమాన్ని బాలానగర్ పోలీస్ స్టేషన్ లో సీఐ నర్సింహా రాజు నేతృత్వంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో సిబ్బందితో కలిసి సీఐ 'వందే మాతరం' పూర్తి గేయాన్ని సామూహికంగా ఆలపించారు. అనంతరం బంకించంద్ర ఛటర్జీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సరితా రెడ్డి, హాజీ మియా, వినోద్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు. బాలానగర్ సీఐ నర్సింహా రాజు మాట్లాడుతూ... 2025తో వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తయ్యాయని, స్వాతంత్ర్యోద్యమానికి స్ఫూర్తినిచ్చి.. నేటికీ దేశ కీర్తిని, ఐక్యతను పెంపొందిస్తున్న చిరతరమైన ఈ గేయానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంస్మరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు. మన జాతీయ గేయం 'వందే మాతరా'న్ని 1875 నవంబరు 7న అక్షయ నవమి శుభ వేళ బంకించంద్ర ఛటర్జీ రచించారని.. బలానికి, శ్రేయస్సుకు, దైవత్వానికి స్వరూపంగా మాతృభూమిని కీర్తించే ఈ గేయం.. దేశ ఐక్యత, ఆత్మగౌరవ స్ఫూర్తికి కవితాత్మక వ్యక్తీకరణ అనతికాలంలోనే ఇది దేశభక్తికి శాశ్వత చిహ్నంగా నిలిచిందన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608

# కార్మిక రాజ్యం ద్వారానే కార్మికుల జీవితాల్లో మార్పు

**దోపిడి శక్తులకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలను బలోపేతం చేయాలి**

**సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్వీ రమ**

**ఉత్తేజపూరితంగా జరిగిన సిఐటియు జనగామ జిల్లా 4వ మహాసభ**

జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 07(ప్రభాత ఉదయం): కార్మిక రాజ్యం ద్వారానే కార్మికుల జీవితాల్లో మార్పు వస్తుందని, ఈ దోపిడి కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు నిర్వహించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్వీ రమ పిలుపునిచ్చారు.జనగామ పట్టణంలోని కామాక్షి ఫంక్షన్ హాల్ కామ్రేడ్ బొట్ల శ్రీనివాస్ నగర్ లో శుక్రవారం సీఐటీయు జనగామ జిల్లా 4 వ మహాసభలు ఉత్తేజ పూరితంగా జరిగాయి.ఈ సభలకు ప్రారంభ సూచికగా సిఐటియు జెండాను జిల్లా అధ్యక్షులు రాపర్తి రాజు ఆవిష్కరించారు. అనంతరం సిఐటియు జనగామ జిల్లా వ్యవస్థాపక కార్యదర్శి అమరుడు బొట్ల శ్రీనివాస్ చిత్రపటానికి యూనియన్ రాష్ట్ర జిల్లా నేతలు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ మహాసభకు అధ్యక్ష వర్గంగా రాపర్తి రాజు, కోడిపాక యాకయ్య బి. అంజుమ్ వ్యవహరించగా ముఖ్య అతిథిగా



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్వి. రమ

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్వి రమ పాల్గొని మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాల వల్ల కోట్లాదిమంది శ్రామికులు తమ ఉపాధిని కోల్పోతున్నారని, ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేటు అధిపతులకు ఆస్తులు అందనంత పెరుగుతున్నాయని, నేటికీ పేదలు కోట్లాదిమంది అర్ధాకలితో అలమటిస్తున్నారని, కేంద్ర ప్రభుత్వ విధానాలను తప్పుపట్టారు. స్వాతంత్రం పూర్వం కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు పరచి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడులను తీసుకొచ్చారని మండిపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ వర్గం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని కార్మిక వర్గం ఎర్ర జెండా పై చేయి సాధించుతుందని, ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తు ఎర్రజెండాదేనని కార్మిక వర్గ రాజ్య స్థాపన కోసం సిఐటియు నిరంతరం పోరాడుతుందని తెలిపారు. జనగామ జిల్లాలో కామ్రేడ్ బొట్ల శ్రీనివాస్ స్ఫూర్తితో జిల్లాలో సిఐటియును అన్ని రంగాలలో విస్తరించేలా నిర్మాణ బలోపేతం కోసం పని చేయాలని కోరారు. ఈ మహాసభలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శులు బి.మధు, పి. శ్రీకాంత్ రాష్ట్ర కమిటీ సభ్యులు యాటల సోమన్న ప్రసంగించారు.వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సింగారపు రమేష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి భూక్య చందు నాయక్ కార్మిక కర్షక ఐక్యత కోసం పాటుపడతామని సాహర్థ సందేశం ఇచ్చారు.ఈ మహాసభలో జిల్లాలోని 12 మండలాల నుండి జనగామ స్టేషన్ఘన్పూర్ పట్టణం నుండి వివిధ రంగాల చెందిన కార్మికుల ప్రతినిధులుగా పాల్గొన్నారు.ఈ మహాసభలో జిల్లా, మండల నాయకులుఅన్నేబోయిన రాజు, చిట్యాల సోమన్న, పొదల నాగరాజు, బస్వ రామచంద్రం, బూడిద ప్రశాంత్, జోగు ప్రకాష్, గుండెబోయిన రాజు తాండ్ర ఆనందం, బత్తిని వెంకన్న, నారోజు రామచంద్రం, ఎండి మహమూద్, రామ్ దయాకర్, ఎం.కుమారస్వామి, మల్లేష్, రాజ్, నీల శ్రీనివాస్, ఏ.రఘు, పండుగ రాజారాం, కచ్చగళ్ళవెంకటేష్, మహేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## వరి కొనుగోలు కేంద్రంను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**మార్కెట్ యార్డు చైర్మన్ కుర్వ నల్ల హనుమంతు**

కేటిదొడ్డి, నవంబర్7 (ప్రభాత ఉదయం)ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రంను రైతులు సద్వినియోగం చేసుకోవాలని గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ కుర్వ హన్మంతు సూచించారు. శుక్రవారం కేటిదొడ్డి మండలం గువ్వలదిన్నె గ్రామంలో ఐకెపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకవచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ ఏడాది ధాన్యం మద్దతు ధరను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఏ గ్రేడ్ రకానికి క్వింటాల్‌కు రూ. 2,389, సాధారణ రకానికి రూ2.369 మద్దతు ధర ఇస్తుందన్నారు. రైతులు ఇబ్బంది పడకుండా వరిధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో ఎపిఎం మద్దిలేటి, నాయకులు ఉరుకుందు, యుగేందర్ గౌడ్, గోపాల్ రెడ్డి, వెంకటేష్ గౌడ్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ తిరుమల వెంకన్న స్వామిని దర్శించుకున్న కొత్తకోట మండల ననాయకులు



కొత్తకోట, నవంబర్ 7(ప్రభాత ఉదయం) తిరుమలలో శ్రీ వెంకటేశ్వర స్వామిని కొత్తకోట మండల నాయకులు శుక్రవారం దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో మదనాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మూలమల్ల వెంకటేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కొత్తకోట పట్టణ అధ్యక్షుడు పోతులపల్లి శ్రీనివాస్, ఐ ఎన్ టి యు సి వనపర్తి జిల్లా అధ్యక్షులు గంగు మాధవరెడ్డి ,కల్వరాల రవీందర్ రెడ్డి ,రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## హరిథాన్ ఇకో హ్యాకతాన్ -2025 జిల్లాస్థాయి ప్రదర్శనలు

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 7 (ప్రభాత ఉదయం)గద్వాలలోని ప్రియదర్శిని ప్రభుత్వ మహళ డిగ్రీ కళాశాలలో శుక్రవారం సాంకేతిక ఆధారిత సృజనాత్మకతను సెంపొందించేందుకు “తెలంగాణానేషనల్ గ్రీన్ కార్ప్స్” వారు కళాశాల ఎకో క్లబ్ ఆధ్వర్యంలో హరిథాన్ ఎకో హ్యాసతాన్ జిల్లాస్థాయి పోటీలను నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. మీనాక్షీ మాట్లాడుతూ ఇ-వేస్ట్ సేకరణ, పునర్వినియోగం. పర్యావరణహితంగా నిర్వహణపై కొత్త ఆలోచనలు పోత్సాహిస్తున్నామని తెలిపారు.జిల్లాలోని వివిధ ప్రభుత్వ డిగ్రీకళాశాల నుండి విద్యార్థినిలు పోటీలకు హాజరయ్యారు. ఈ పోటీలలో విద్యార్థినులు ఇ-వేస్ట్, ఎకో ఏటిఎం మెషిన్, రీసైక్లిన్ తదితర అంశాలపై ప్రదర్శనలు ఇచ్చారు.ఈ పదర్శనలకు న్యాయ నిర్ణేతలుగా టిఎన్ జిసి కోఅర్డినేటర్ శ్రీధర్ భాస్కర్ పాపన్న వ్యవహరించారు. ఈ పదర్శనలో పథమ బహుమతి -ఎం.భూమిక, రెండవ బహుమతి జి.ఎస్ స్మృతి టీం, మూడవ బహుమతి ఎన్.శృతి గెలుపొందారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వచ్చిన డిఇఒ విజయలక్ష్మి, సీపీడీసి మెంబర్ సాయిశ్యామ్ రెడ్డి హాజరై గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అద్యాపక బృందం, విద్యార్థినిలు పాల్గొన్నారు.


ఏఎంసి లో వందేమాతరం గేయాలాపన చేస్తున్న చైర్మన్, సిబ్బంది

## వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో వందేమాతరం గీతాలాపన

**పాల్గొన్న ఏఎంసి చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్**

జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 07(ప్రభాత ఉదయం): జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మహాకవి బంకిమ్ చంద్ర చటర్జీ రచించిన వందేమాతరం గీతం 150 సంవత్సరాలు పుర్తివుతున్న సందర్భన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ముందు అధికారులు, వ్యాపారులు, హమాలీలు, దడువాయిల సమక్షంలో ఉదయం వందేమాతరం గీతాలాపన ఘనంగా నిరహించారు. ఈ కార్యక్రమంలో జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, ఏఎంసీ సూపర్వైజర్ బోట్ల శ్రీనివాస్, వ్యాపారులు శర్విరాల ఉపేందర్, రమేష్, హమాలీ సంఘం నాయకులు రాజు, వీరస్వామి, సోమయ్య, ఐలయ్య, హమాలీలు, దాడువాయి నాయకులు మధు, రాజు, ఏఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## జములమ్మ ఆలయంలో వేలం పాట

**టెంకాయల విక్రయం, కొబ్బరి చిప్పల సేకరణ వేలంలో రూ.64.95 లక్షల ఆదాయం**

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్7(ప్రభాత ఉదయం)నడిగడ్డలో భక్తుల కొంగుబంగారంగా పూజలందుకుంటున్న జములమ్మ దేవస్థానంలో ఎండోమెంటు ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ, ఆలయ ఈవో పురేందర్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం టెంకాయల వేలం పాట నిర్వహించారు. మొదట టెంకాయల విక్రయానికి వేలం పాట నిర్వహించగా ఎనిమిది పోటాపోటీగా పాట పాడారు. అందులో గద్వాలకు చెందిన వెంకటనర్సింహులు రూ. 52,50,000 దక్కించుకున్నారు. గత ఏడాది రూ.50.04లక్షలకు వేలంపాట దక్కించుకోగ రూ.2.46లక్షలు అధికంగా సమకూరింది. టెంకాయల చిప్పల సేకరణకు వేలం నిర్వహించగా 18మంది పాటలో పాల్గొన్నారు. ఇందులో తోటరాముదు రూ.12.45 లక్షలకు దక్కించుకున్నారు. గత ఏడాది కంటే రూ. 23 వేలు అధికంగా సమకూరింది. లడ్డూ ప్రసాదం విక్రయానికి వేలం పాటలో సురేష్ రూ.4.10 లక్షలు దక్కించుకున్నారు. ఈ ఏడాది టెంకాయ ల విక్రయం, చిప్పల సేకరణ, చీరల వేలం ద్వార రూ.64.95 లక్షల ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెంకట్రాములు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## ఆర్ బి వి ఆర్ పోలీస్ అకాడమీలో ఘనంగా వందేమాతరం గీతాలాపన



రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, నవంబర్ 7(ప్రభాత ఉదయం) రాష్ట్ర పోలీస్ అకాడమీలో భారత దేశంలోవందేమాతరం గేయం పాడటం మొదలై 150 వసంతాల సందర్భంగా గీతాలాపన ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పోలీస్ అకాడమీ లోనిరాణిరుద్రమదేవి సమావేశ మందిరం ఆవరణలో అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, కవిత, శ్రీరామమూర్తి వందేమాతర పాటను పాడుతూ ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. వందేమాతరం గేయం రచించిన బంకించంద్ర ఛటర్జీ గురించి ,అనాడు ఈ గేయం స్వతంత్ర పోరాటం లో స్పూర్తి నింపిన విధానంగురించి అధికారులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రొబేషనరీ డీఎస్పీలు,అకాడమీ ఎడి లు, డి ఎస్ పి లు, సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయ వంతం చేశారు.


చుక్క సత్తయ్య విగ్రహావిష్కరణకు భూమి పూజా చేస్తున్న కుర్మ సంఘ నాయకులు

## ఒగ్గుకళా సామ్రాట్ చుక్క సత్తయ్య విగ్రహావిష్కరణకు భూమి పూజ

జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ (ప్రభాత ఉదయం): జిల్లా కేంద్రంలోని కల్లెం రోడ్డు కమాన్ పక్కన, ఒగ్గుకళా ప్రవీణులు, ఒగ్గుకళా సామ్రాట్, కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత, డాక్టర్ చుక్క సత్తయ్య 8వ వర్ధంతి నవంబర్ 9 ని పురస్కరించుకొని విగ్రహావిష్కరణకు సంబంధించిన భూమి పూజ కార్యక్రమాన్ని జిల్లా కురుమ సంఘం నేతలు, ఒగ్గుబీర్ల కళాకారులు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు కంచ రాములు కురుమ, రాష్ట్ర కురుమ సంఘం ఉపాధ్యక్షులు సేవెల్లి సంపత్ కురుమ, జిల్లా ప్రధాన కార్యదర్శి జాయ మల్లేష్ కురుమ, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు బాల్దే మల్లేశం, జూకంటి శ్రీశైలం, కోపా అధ్యక్షులు కడకంచి మధు, కోశాధికారి ఏండ్రు వైకుంఠం, కేమిడి ఉపేందర్, లింగాల ఘనపూర్ కురుమ సంఘం మండల అధ్యక్షుడు బండ చంద్రమౌళి, జనగామ జిల్లా ఒగ్గు సంఘం అధ్యక్షులు బండి వీరస్వామి, ప్రధాన కార్యదర్శి జంగిడి సిద్దులు, గౌరవ సలహాదారులు చౌదరిపల్లి రోషయ్య, బండ్రు సత్తయ్య, కోశాధికారి బండి ప్రవీణ్, నెల్లుట్ల పెద్ద కురుమ కడకంచి ఆంజనేయులు, ప్రచార కార్యదర్శి బర్ల అనిల్ కుమార్, లింగాల ఘనపూర్ మండల అధ్యక్షులు చిన్నం శ్రీనివాస్, మండల గౌరవ సలహాదారులు చౌదరిపల్లి ఎల్లయ్య, చౌదరిపల్లి అంజయ్య, కార్యవర్గ సభ్యులు బుగ్గ శ్రీనివాస్, బడికే శ్రీనివాస్, చౌదరిపల్లి మల్లయ్య, చౌదరిపల్లి ఉపేందర్, చౌదరిపల్లి ప్రవీణ్, చౌదరపల్లి ప్రశాంత్, బండ మల్లేష్, బర్ల భరత్, జనగామ మండల సలహదారులు జాయ సత్తయ్య, బండారి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి రవి ప్రసాద్

## విద్యార్థులు పొదుపు చేయడం నేర్చుకోవాలి

**యస్వంతాపూర్ వి ఏ ఓ నరసింహులు**

**మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి**

**ఎన్ ఎస్ ఎస్ పోగ్రాం ఆఫీసర్ మరిపెల్ల రవి ప్రసాద్**

జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 07(ప్రభాత ఉదయం): జిల్లా లోని జనగామ మండలం, యస్వంతాపూర్ గ్రామం లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఎన్ ఎస్ ఎస్ ప్రత్యేక శిబిరం ను ప్రభుత్వ జూనియర్ కళాశాల ధర్మ కాంచ, జనగామ సీనియర్ అధ్యాపకులు, స్టూడెంట్ కౌన్సిలర్ మహమ్మద్ అఫ్జాల్ ప్రారంభించారు.నాలుగవ రోజు కార్యక్రమంలో యశ్వంతాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇష్తాకరుద్దీన్ ఆధ్వర్యంలో వాలంటీర్స్, సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ వారితో కలిసి వందేమాతరం గీతం ఆలపించారు. తరువాత డ్వాక్రా గ్రామ ఇన్చార్జి ( వి ఓ ఏ ) ఐనా నర్సిహులు, డ్వాక్రా గ్రూప్ మహిళలతో వాలంటీర్స్ ముఖా ముఖి కార్యక్రమం చేపట్టారు..ఈ కార్యక్రమంలో డ్వాక్రా గ్రూపు మహిళలు ఎలా పొదుపులు చేయాలి. కొత్త సంఘాలు ఎలా నియమించుకోవాలి, ప్రభుత్వ పథకాలను ఏ విధంగా వినియోగించుకోవాలి. ప్రమాద బీమా, ఇతర అలవెన్సులు అనే అంశం పైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ పోగ్రామ్ ఆఫీసర్ మరిపెల్ల రవి ప్రసాద్, కళాశాల అధ్యాపకులు సమ్మయ్య, డాక్టర్ వస్కుల శ్రీనివాస్, గణేష్, డాక్టర్ వరుధిని, కాపర్తి శ్రీనివాస్, తిరుమలేష్, గర్ల్స్ వాలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు.



## కొత్తకోట పట్టణంలో నూతన వధూవరులను ఆశీర్వదించిన నాయకులు

కొత్తకోట, నవంబర్ 7(ప్రభాత ఉదయం) కొత్తకోట పట్టణంలో ఎ టి అర్ కన్వెన్షన్ హాల్లో జరిగిన ఇటుకూరి రాజేశ్వరి చక్రవర్తి కుమార్తె భవ్య, రాకేష్ ల వివాహ వేడుకలో సీనియర్ నాయకుల మూలమల్ల భీమిరెడ్డి , మాజీ సిడిసి చైర్మన్ మూలమల్ల చంద్రశేఖర్ రెడ్డి ,దాబా శ్రీనివాస్ రెడ్డి ,హర్షవర్ధన్ రెడ్డి, కోటేశ్వర్ రెడ్డి ,భీమ చంద్రకాంత్, వడ్డే కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బూత్కూర్ గ్రామం జరిగిన మండ్ల సరిత రాములు కుమార్తె భాను శ్రీ, శివ కుమార్ ల వివాహ వేడుకలు కొత్తకోట పట్టణం ఆర్కే రెడ్డి ఫంక్షన్హాల్లో జరిగిన వివాహ వేడుకల్లోసీనియర్ నాయకులు మూలమల్ల భీమ్ రెడ్డి , ఎండి వహీద్ ,జగదీష్ ,సీత మొగులన్న ,జయరాజు , కృష్ణ మోహన్ కుమార్ లు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.